

అర్చకునిపై దాడికి సిపిఎం ఖండన

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలోని అర్చకులపై వైసిపి నాయకుడు చేసిన దాడిని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అర్చన సహాయ చేయలేదన్న కారణంతో వైసిపి నాయకుడు సిరియాల చంద్రరావు గుడి సహాయ అర్చకుడు పెద్ద సోమయాజుల వెంకట సత్య సాయి చెంపపై కొట్టడం, కాలితో తన్నడం దారుణమన్నారు. మరో అర్చకుడు మద్దిరాల వెంకట విజయ కుమార్ పైన చేయి చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఆలయంలో అసభ్య పదజాలంతో అర్చకులను దూషించారని తెలిపారు. అర్చకులపై దాడి చేసిన సిరియాల చంద్రరావుపై చర్యలు తీసుకోవాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు. భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల కోలాహలం

- అంతటా సందడే సందడి
- వ్యూహ, ప్రతి వ్యూహాల్లో నేతలు
- గెలుపే లక్ష్యంగా పార్టీల సన్నాహాలు



ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో సందడి వాతావరణం కనిపిస్తుంది. వాడవాడలా, వీధివీధినా కోలాహలం నెలకొంది. వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో గెలుపే లక్ష్యంగా పార్టీలు పావులు కదుపుతున్నాయి. వచ్చే నెల18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 25 వరకూ నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన జరుగుతాయి. 29 వరకూ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మొత్తం ఎన్నికల ప్రక్రియ జూన్ 6తో ముగియనుంది. మరో 20 రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో అన్ని పార్టీల్లోనూ హడావిడి మొదలైంది. ఇప్పటికే అధికార, విపక్ష కూటమిలు అభ్యర్థులను ఖరారు చేశాయి. బరిలో నిలిచేది ఎవరనేది తేలిపోయింది. ఈ నేపథ్యంలో పోటీలో ఉండే వారంతా ఇప్పటికే ప్రచారాన్ని మొదలుపెట్టేశారు. అధికార పార్టీ అభ్యర్థులు అయితే ప్రచారంలో ఒక అడుగు ముందే ఉన్నారు. ఓ పక్క ఎండలు మండిపోతున్నా రాజకీయ నాయకుల హడావుడితో ఎన్నికల కోలాహలం కనిపిస్తుంది. పల్లె, పట్టణాల్లో ఎక్కడ చూసినా రాజకీయ సందడి నెలకొంది.

వ్యూహాలు, సన్నాహాలు

సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు తమ వ్యూహాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నాయి. అందుకు అనుగుణంగా సన్నాహాలు చేస్తున్నారు. అధినేతలు ప్రచార షెడ్యూల్ను కూడా సిద్ధం చేసుకున్నారు. ముఖ్యంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తుండడంతో ఈ నెల 30న నియోజకవర్గానికి రానున్నారు. మూడు రోజులపాటు ముఖ్య నాయకులతో భేటీ కానున్నారు. ఆ తర్వాత రాష్ట్రంలో మిగిలిన నియోజక వర్గాలకు ఇక్కడ నుంచే ఆయన పర్యటించే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. వైసిపి నుంచి బరిలో ఉన్న కాకినాడ ఎంపీ వంగా గీత ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతున్నారు. మీ ఆడపడుచుగా, స్థానికురాలిగా సేవలు అందిస్తున్నానని చెప్పుకుంటున్నారు. పవన్ కళ్యాణ్ పోటీతో వైసిపి పిఠాపురంపై ప్రత్యేక ఫోకస్ను పెట్టింది. ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టి వ్యవహరిస్తుంది. మిథున్ రెడ్డి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం, మాజీమంత్రి కురసాల కన్నబాబు, మంత్రి దాడిశెట్టి రాజా, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వంటి నాయకులను ఇక్కడ వ్యూహకర్తలుగా వ్యవహరిస్తారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. తునిలో దాడిశెట్టి రాజా కుటుంబం, అటు యనమల రామకృష్ణుడు సహా అభ్యర్థి యనమల దివ్య తమదైన శైలిలో ప్రచారంలో పాల్గొంటున్నారు. వరుపుల రాజా మృతితో టిక్కెట్ దక్కించుకున్న ఆయన సతీమణి సత్యప్రభ సానుభూతి ద్వారా గట్టెక్కాలని ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమంటూ ముందుకు వెళుతున్నారు. ఈ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎంఎల్ఎని కాదని వరుపుల సుబ్బారావుకు సీటు కేటాయించడంతో ఆయన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కాకినాడ రూరల్‌లో కురసాల కన్నబాబు ప్రత్యేకంగా కరప మండలంపై ఫోకస్ పెట్టారు. ఆ మండలంలో ఓటర్లను తమ వైపుకు తిప్పుకునే పనిలో నిమగ్నమయ్యారు. వైసిపి వైఫల్యాలను వివరిస్తూ జనసేనకు ఓటు వేసి గెలిపించాలంటూ పంతం నానాజీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. కాకినాడ సిటీలో ద్వారంపూడి మరోసారి పాగా వేయాలని భావిస్తున్నారు. అన్ని వర్గాలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఇటీవల మూడవ జాబితాలో సీటు కన్ఫర్మ్ అవ్వడంతో మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ప్రచారాన్ని ప్రారంభించారు. మూడోసారి హ్యాట్రిక్ సాధించాలనే తపనతో ఉన్న చినరాజప్ప ప్రచారంలో కాస్త వెనకబడి ఉన్నారు. టిడిపిలో ఉన్న వర్గపోరు కారణంగా ఆయన పూర్తిస్థాయిలో ప్రచారాన్ని చేయలేకపోతున్నారు. వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబు తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అటు జగ్గంపేటలో తోట నరసింహం కుటుంబం ముమ్మరంగా ప్రచార పర్వంలో ఉన్నారు. జ్యోతుల నెహ్రూ సహా, కూటమిలో టికెట్ దక్కక గుర్రుగా ఉన్న పాఠం శెట్టి సూర్యచంద్ర ప్రచారంలో పాల్గొంటున్నారు. కాకినాడ పార్లమెంటు బరిలో వైసిపి నుంచి పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్ అన్ని నియోజకవర్గాల్లోనూ ముఖ్య నాయకులతో భేటీ అవుతున్నారు. టైట్ షెడ్యూల్ వేసుకుని ప్రచారంలో పాల్గొంటున్నారు. కూటమి అభ్యర్థి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ ముఖ్య నాయకులను కలుస్తున్నారు. ప్రచారాన్ని ఇంకా ప్రారంభించలేదు. పవన్ కళ్యాణ్ పిఠాపురం వచ్చిన తర్వాత ఆయన ప్రారంభించే అవకాశం ఉంది. ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ సందడి నెలకొనడంతో కాకినాడ జిల్లాలో రాజకీయాలు మరింత వేడెక్కాయి.

సందడే సందడి

ఏ నలుగురు కలుసుకున్నా ఎన్నికల ముచ్చట్లపైనే చర్చించుకుంటున్నారు. అభ్యర్థులు, వారి బంధువులు, స్నేహితులు, ఇతర కుటుంబ సభ్యులు ఎన్నికల పనిలోనే ఉన్నారు. ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ ఎవరెవరి మద్దతు ఉంటుందనేది అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో వైసిపి 151 స్థానాల్లో విజయం సాధించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 స్థానాలకు 14 స్థానాల్లో విజయం సాధించింది. ఈసారి కూడా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునే పనిలో నిమగ్నమైంది.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కమిషనర్ కన్నబాబు

పనులు కల్పించాల్సిన బాధ్యత అధికారులదే

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉపాధి పనులు కల్పించవలసిన బాధ్యత అధికార యంత్రాంగానిదేనని పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కన్నబాబు అన్నారు. బుధవారం మండలంలోని చిన్న బ్రహ్మదేవం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను డ్రామా పిడి అడపా వెంకటలక్ష్మి, జడ్పి సిఇఒ శ్రీరామచంద్రమూర్తి, డిపిఒ భారతి సౌజన్యలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వివరాలు, కూలీల సంఖ్య, వారికి వస్తున్న వేతనాలు వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. మెట్ట గ్రామాల్లో వేసవిలో ఏ పనులు ఉండవని దీనిని దృష్టిలో పెట్టుకుని ఎక్కువమందికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ బాలామణి, ఎంపిడిఒ ఉషారాణి, ఇఒపిఆర్‌డి రాజశేఖర్, కాకినాడ డ్రామా ఎపిడి భాను ప్రకాష్, వసంత మాధవి, రమేష్ పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎంపిడిఒ ఉషారాణి అధ్యక్షతన పంచాయతీ, సచివాలయం, ఉపాధి, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏ గ్రామంలోనూ మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిపిఓ భారతి సౌజన్య, డ్రామా పిడి అడపా వెంకటలక్ష్మి, డిఎల్‌పిఒ బాలామణి, డిఎల్‌డిఒ కెఎస్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు ఓట్ ఫ్రమ్ హోం

ప్రజాశక్తి - కాకినాడ

85 ఏళ్ల పైబడిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓట్ ఫ్రమ్ హోంను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నూతన ఒరవడికి నాంది పలికిందని అన్నారు. ఎన్నికలలో పోలింగ్ శాతాన్ని పెంపొందించే దిశగా ఈ యొక్క నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. మొబైల్ వాహనం సాయంతో ఇంటి వద్ద ఉన్న 85 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగుల వద్దకు ఎన్నికల సిబ్బందే వెళ్లి ఓటు వేయించనున్నారని తెలిపారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతానికి మించి అంగవైకల్యం ఉండి సదరమ్ ధృవపత్రం కలిగి నడవలేని స్థితిలో ఉన్న వారు ఈ విధానంలో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికల సంఘం మార్గ దర్శకాల ప్రకారం నడవ లేని స్థితిలో కేంద్రానికి రాలేని ఓటర్లను గుర్తించి పారం-12 డి ద్వారా ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధి కారికి దరఖాస్తు చేయాల ని, వాటిని పరిశీలించిన అనంతరం హోమ్ ఓటింగ్ అర్హులైన వారి జాబితా రూపొందించి ఏ రోజు ఓటింగ్ వేయాలో వారికి అధికారులు ముందస్తుగా సమాచారం ఇస్తారని తెలిపారు. ఆ రోజున బ్యాలెట్ పేపర్‌పై రహస్య ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తారని చెప్పారు. ఓటు వేసిన అనంతరం సీలు వేసిన బ్యాలెట్ పత్రాన్ని మండల తహశీల్దార్ కార్యాలయానికి తరలిస్తారని తెలిపారు.



వినతిపత్రాన్ని అందిస్తున్న యూనియన్ నాయకులు

పోర్టులో స్థానికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్ట్‌లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని సిఐటియు జిల్లా కోశాధికారి ఎంవి.రమణ డిమాండ్ చేశారు. కాకినాడ పోర్టులో సర్వేయర్స్‌గా, టాలీ వర్కర్లుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులు బుధవారం యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే యూనియన్ ప్రతినిధి వర్గం ది కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులను కలి సేందుకు వెళ్లారు. అయితే ఆయన అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయన కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి ఎంవి.రమణ మాట్లాడుతూ సర్వే, టాలీ క్లర్కులుగా పోర్ట్‌లో ఏళ్ల తరబడి అనేకమంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. అయితే వీరికి ఏవిధమైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. సంవత్సరాల తరబడి పనిచేస్తున్న కార్మికులను కాదని, కాంట్రాక్టర్ కొత్తగా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారికి పనులు కల్పించడం వల్ల స్థానికులు ఉపాధిని కోల్పో తున్నారని అన్నారు. స్థానికులకు ఉపాధి అవకా శాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవా లని, నూతనంగా ఏర్పాటు చేసుకున్న యూని యన్‌ను గుర్తించి కార్మికులకు కొన్ని రకాల చట్టపరమైన సౌకర్యాలు కల్పించడంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కలగజేసుకోవాలని కోరారు. ఈ కార్య క్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పెండెం సూర్యారావు, పినపోతు కుమారస్వామి, కంటిపాము చిట్టిబాబు, పాలిక రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.2 లక్షల మిగులుతో సొసైటీ బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు నాగేంద్రబాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నం వ్యవసాయ సొసైటీ మహాజనసభ బుధవారం సొసైటీ చైర్మన్ నల్లల నాగేంద్రబాబు అధ్యక్షతన సొసైటీ కార్యాలయంలో జరిగింది. సొసైటీ సిఇఒ ఎన్.వీర వెంకటసత్యనారాయణ రూ.3.2 లక్షల మిగులుతో 2024-25 బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ బడ్జెట్‌ను మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం సొసైటీ చైర్మన్ నాగేంద్రబాబు మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.1.5 లక్షలు సభ్యుల సభ్యత్వం కలిగిన ఈ సొసైటీ రూ 1.25 కోట్లు డిపాజిట్లుగా సేకరించిందన్నారు. 600 మందికి రూ.4.97 కోట్ల దీర్ఘకాలిక రుణాలుగా,రైతు నేస్తం కింద రూ.5.91 కోట్లు, ఇతర రుణాల కింద రూ.5.48 కోట్లు వెరసి మొత్తం రూ.16.36 కోట్లు అందించామన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో 254 టన్నుల యూరియా ఇతర రకాలు కలిపి రూ.23.64 కోట్ల విలువైన ఎరువులు రైతులకు సరఫరా చేశామన్నారు. ఈ సమావేశంలో సొసైటీ మాజీ అధ్యక్షులు గుణ్ణం వీరభద్రరావు, పుట్టా వెంకటరావు, మార్ని వెంకటరావు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి దోహదపడేలా పరిశోధనలు

ప్రజాశక్తి - కాకినాడ



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న విసిలు ప్రసాద్‌రాజు, పద్మరాజు

సమాజ అభివృద్ధికి దోహదపడేలా విద్యార్థులు నూతన పరిశోధనలను ఆవిష్కరించాలని జెఎన్‌టియుకె ఉపకులపతి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాద రాజు పిలుపు నిచ్చారు. బుధవారం జెఎన్‌టియుకె డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నేషనల్ ఇనీషియేటివ్ ఫర్ డిజైన్ ఇన్నోవేషన్ సహకా రంతో రెండు రోజులపాటు జరిగే ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.పద్మ రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను చేపట్టాలన్నారు. ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్లో విద్యార్థులు చాలా సృజనాత్మ కమైన ఆవిష్కరణలను ప్రదర్శించడం జరిగింద న్నారు. సమాజానికి, రైతులకు ఇతర రంగాలకు ఉపయోగపడేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను ఈ ఎగ్జిబిషన్లో ప్రదర్శించా రన్నారు. విద్యార్థులు ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించి సరికొత్త ఆవిష్క రణలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నన్నయ విసి ప్రొఫెసర్ కె.పద్మరాజు మాట్లాడుతూ ఇటువంటి ఇన్నోవేషన్ ఫెయిర్లలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వారికి పరిశోధనలపై మరింత ఆసక్తి పెరుగుతుందని, తద్వారా సమాజాభివీద్ధికి తోడ్పడే ఆవిష్కరణలను రూపొందించేందుకు వీలు కలుగుతుందన్నారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యా లయాలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు సృజనాత్మకమైన ఆవిష్కరణలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఇన్నోవేషన్ ఫెయిర్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 200కు పైగా నమూ నాలను ప్రదర్శించడం జరిగిందని డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ అన్నారు. ఈ ప్రదర్శనలో అత్యుత్తమైన నమూనాలకు నగదు బహు మతులను అందజేయడం జరుగుతుందన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ను నగర ప్రజలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఉచితంగా సందర్శించవచ్చుని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎల్.సుమలత, ఓఎస్ ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కళ్యాణ మనోహర్ డైరెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, వైస్ ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపికి మరో కీలక నేత రాజీనామా



ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని గోనేడ గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లు విజయకుమార్ వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం చేశారని ఆరోపించారు. మండలంలో సీనియర్ నాయ కుడు తోట నరసింహం ఇన్‌ఛార్జ్ బాధ్యతలు చేపట్టిన ఇప్పటి వరకూ తనకు ఎటువంటి సమాచారం ఇవ్వక పోవడంతో మనసా ్ధపానికి గురయ్యానని అన్నారు. అందుకే వైసిపికి రాజీనామా చేశానని తెలిపారు. త్వరలోనే తన భవిష్యత్ కార్యచరణను అనుచరులు, ఇతర నాయకులతో సప్రదించి ప్రకటిస్తానని తెలిపారు.

ఆదిత్యలో ఘనంగా గ్రాండ్ స్కిల్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - కాకినాడ



విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న శివప్రసాద్

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో గ్రాండ్ స్కిల్ ఎక్స్పో - 2024 ఫెస్ట్ ఘనంగా జరిగింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్. నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, శారీరక దారుఢ్యానికి క్రీడలు మరియు సాంస్కృతిక కళలు ఉపయోగపడతాయని అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రతినెల స్కిల్ ఎక్స్పో పేరిట విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తామని, ప్రతినెల నిర్వహించిన కార్యక్రమాల తర్వాత ఆయా అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రాండ్ స్కిల్ ఎక్స్‌పో పేరిట ఒక ఫెస్ట్ నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలను జ్ఞాపికలను అందిస్తామని అన్నారు.ఈ కారక్రమంలో పాల్గొన్న ఇస్రో మాజీ సైంటిస్ట్ యాళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాలలోనూ రాణించాలని అన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఆంగ్ల విభాగాధిపతి ఎల్.వంప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి విజయానికి శక్తివంచన లేకుండా కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నయ్యదొర

ప్రజాశక్తి - సామర్లకోట

రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని భారత్ మాతా సేవా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గొరకపూడి చిన్నయ్య దొర తెలిపారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వం నుంచి రాష్ట్రంలో పలు రాజకీయ పార్టీలు, ప్రముఖ నాయకులతో సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అయినా తానెప్పుడూ ఏ రాజకీయ పార్టీ నుంచి ఎలాంటి ప్రయోజనం పొందలేదన్నారు. 2014 నుంచి టిడిపిలో ఉన్నానని, అయితే ఆ పార్టీ కొన్ని అవకాశాలు ఇచ్చినా వినియోగించుకోలేదని వెల్లడించారు. ప్రతిపక్షాలన్నీ కూటమిగా ఏర్పడినా ఒంటరిగా పోటీ చేస్తున్న జగన్ ధైర్యాన్ని చూసి స్వచ్ఛంధంగా వైసిపిలో చేరానని తెలిపారు. ఎన్నికల సమయంలో తనకున్న పరిచయాలను బట్టి రాష్ట్రవ్యాప్తంగా వైసిపి విజయానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను వైసిపి నాయకుడు దవులూరి సుబ్బారావు శాలువా కప్పి సత్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోసెస్, పట్టణ పార్టీ అధ్యక్షులు మద్దాల శ్రీను, కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్, కో అప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు, నాయకులు పాలిక చంటిబాబు, దూది రాజుబాబు, ఇరుసుమల్ల సాయి, సల్లూరి కళ్యాణ్, వారా సుధాకర్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అధికారంలోకొచ్చాక మా సారు ఏం చేయడం లేదంటావేమయ్యా..? రోజుకు రెండు పనులు చేస్తూంటేనూ..!!!

జగన్‌ను ఇంటికి సాగనంపడమే లక్ష్యం : యనమల

ప్రజాశక్తి - కోటనందూరు



సమావేశంలో మాట్లాడుతున్న యనమల

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపడమే కూటమి అంతిమ లక్ష్యమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామ కృష్ణుడు అన్నారు. బుధవారం జనసేన పార్టీ కాకినాడ పార్లమెంటు నియోజక వర్గ అభ్యర్థి తంగిళ్ళ ఉదయ శ్రీనివాస్ తుని రూరల్ మండలం తేటగుంటలో టిడిపి కార్యాలయంలో ఆయనతో పాటు, టిడిపి తుని నియోజకవర్గ అభ్యర్థి యనమల దివ్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుని నియోజకవర్గంలోని తుని, కోటనందూరు, తొండంగి, తుని రూరల్ ప్రాంతాలకు చెందిన టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఉదయ శ్రీనివాసు, దివ్యలను గెలిపించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్లను చైతన్య వంతులు పరిచి ఓటు ఎలా వేయాలో వారికి నేర్పించాలని, ఉమ్మడి అభ్యర్థులందరూ కలిసికట్టుగా పనిచేసే గెలిపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్‌ను ఇంటికి పంపించిన వారు అవుతారని అన్నారు. ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలోనూ పర్యటిస్తానని ప్రజలతో మమేకమై వారి యొక్క కష్టసుఖాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తీర్చడానికి కషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు సోడిశెట్టి గణేష్, మోతుకూరు వెంకటేష్, ఎస్.లోవరాజు, చింతమనేడి అబ్బాయి పాల్గొన్నారు.

మత్స్యకార సంఘాలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



సంఘ సభ్యులతో విద్యార్థులు

మత్స్యకార సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని మత్స్యకార శాఖ ఉద్యోగులు, ట్రాన్సేటర్స్ ఎం.జగదీశ్వరి, ఎస్.పైడి తల్లి తెలిపారు. బుధవారం ఉప్పాడ మత్స్యకార సమైక్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో కాకినాడ, ఢిల్లీ, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఐఐఎఫ్‌టి, ఐపిఎం, ఎంబిఎ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు, స్థితిగతులు తెలుసుకోవడానికి సంఘాల సభ్యుల స్థితిగతులు, విద్య, ఆరోగ్యం పట్ల గ్రామీణ ప్రాంతంలో ఉన్న వాస్తవ పరిస్థితులు అవగాహన కల్పించారు. సంఘాలు బలోపేతం కావడం ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో మహిళల అభివృద్ధి సాధిస్తారని తెలిపారు.

నేరాలు ఘోరాలు

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని గోపవరం గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న పోసిపోయిన ప్రసాద్‌ను అరెస్టు చేశామని సిఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని వారు కుమార్ హెచ్చరించారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చాగల్లు

బ్రాహ్మణగూడెం గ్రామంలో బుధవారం ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రే ఇజ్రాయేలు (73) మృతి చెందారని ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. ఇజ్రాయేలు బైకుపై వెళ్తుండగా ఎదురుగా మరో వ్యక్తి బైకుపై వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇజ్రాయేలుకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మృతి చెందారు.

123 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని పల్లంకూరు పంచాయతీ శివారు మొల్లేటి మొగ గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఓలేటి గంగాధ్రి నుంచి 123 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి, పోలీసు పరుస్తామని చెప్పారు. ఆయన వెంట స్టేషన్ సిబ్బంది మణికంఠ స్వామి తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో జగనన్న కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న గృహానికి పెయింటింగ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై పెయింటర్ బుధవారం దుర్మరణం చెందాడు. రంగంపేట మండలం ముంగండం గ్రామానికి చెందిన ముమ్మిడి బలిబీర్రాజు (31) పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

11 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పాలంగి చెక్ పోస్ట్ వద్ద 11 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. ఉండ్రాజవరం ఎస్ఐ. వి.ఆర్.ఎం.ఎస్ శ్రీను తెలిపిన వివరాల మేరకు బుధవారం చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఉండ్రాజవరం వైపు ఇరువురు వ్యక్తులు నడిచి వెళ్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేశారు. సుమారు 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాకినాడ నుంచి గంజాయిని తీసుకొచ్చి, మండలంలోని పలు ప్రాంతాల్లో అమ్మేందుకు వచ్చినట్టు వారు విచారణలో తెలిపారు. నిందితులు కేరళకు చెందిన పి. రాజీవ్‌రవి, కె.సుల్ఫికర్‌గా గుర్తించారు. రెండు సెల్ ఫోన్లు, రూ.300 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిని రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ద్వారా సేవాభావం

ప్రజాశక్తి - కాకినాడ



ఎన్ఎస్ఎస్ పిఒలకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న విసి ప్రసాదరాజు

సేవ చేయడంలోనే అమితమైన ఆనందం ఉంటుందని, అది ఎన్ఎస్ఎస్ ద్వారా సాధ్య పడుతుందని జెఎన్‌టియుకె ఉప కులపతి ప్రొఫెసర్ జివిఆర్. ప్రసాదరాజు అన్నారు. బుధవారం జెఎన్‌టియుకె ప్రాంగణంలోని సెనేట్ హాలులో యూనివర్సిటీ అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ పిఒలతో సమీక్షా సమావేశం, ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీ సర్లు, వాలంటీర్లకు అవార్డుల ప్రధానం కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా సమాజానికి సేవ చేస్తూనే ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ లక్ష్యాలను సాధించాలన్నారు. అందుకు ప్రోగ్రాం ఆఫీసర్లు తోడ్పాటునందించాలన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు సామాజిక అంశాలపై చైతన్యం కలిగిలే సోషల్ ఇంజనీరింగ్ ప్రాజెక్టు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ద్వారా గ్రామాలలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎల్.సుమలత మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి గ్రామాలు వెన్నుముక లాంటివన్నారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించవచ్చునన్నారు. ఓఎస్ ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వారా స్వీయ రక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. అనంతరం నలుగురు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు, నలుగురు వాలంటీర్లకు ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఉత్తమ వాలంటీర్ అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో యుసిఇకె ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.రమణాజీ, ఎంవిఎస్.కిరణ్మయి, డాక్టర్ పి.వీరలక్ష్మి, అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ పిఒలు పాల్గొన్నారు.

తక్కువ ధరల్లో హోమ్ నీడ్స్

ప్రజాశక్తి - సామర్లకోట


షాపును ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త బిక్కిన సాయి, విష్ణుప్రకాష్

పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకుని మార్కెట్ ధరలతో పోలిస్తే 5శాతం తక్కువ ధరలకు నాణ్యమైన హోమ్ నీడ్స్ అందిస్తున్నట్టు విక్టరీ సూపర్ బజార్ డైరెక్టర్ కర్రి విష్ణుప్రకాష్ అన్నారు. పట్టణంలో నూతన విక్టరీ బజార్ 50వ బ్రాంచి ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, అన్నదానం ట్రస్ట్ నాయకులు బిక్కిన సాయి రిబ్బను కత్తిరించి విక్టరీ బజార్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విష్ణుప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన షాపింగ్ మాల్స్‌లో ఇది 50వ మాల్ అన్నారు. బయట మార్కెట్ ధరలతో పోలిస్తే తమ మాల్లో 5 శాతం పైబడి తక్కువ ధరలకు సరుకులు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విక్టరీ బజార్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే వైసిపిని గెలిపిస్తాయి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



గత ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలే వైసిపిని గెలిపిస్తాయని ఉభయగోదావరి జిల్లాల మహిళా జోనల్ ఇన్‌ఛార్జ్, ఎపి స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి పార్టీలు జగన్‌ను గద్దె దించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని అన్నారు కూటమి వల్ల రాష్ట్రంలో ఒరిగేది ఏమీ లేదన్నారు. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత లేకుండా బయటకు రాలేని చంద్రబాబు జగన్ యాత్ర గురించి విమర్శించటం విడ్డూరంగా ఉందని అన్నారు. చంద్రబాబు ప్రజలను ఓట్లు అడిగే నైతికత లేదని అన్నారు. దత్తపుత్రుడు పవన్ రాజకీయం చూస్తుంటే ఆ పార్టీ వారే తిట్టుకునే పరిస్థితి కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రం మరింతగా అభివృద్ధి సాధించాలంటే మరోసారి సిఎంగా జగన్ రావాలన్నారు.

సీ- విజిల్ యాప్ దరఖాస్తులు పరిష్కారం



ప్రజాశక్తి - కాకినాడ

పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు-2024 కు సంబంధించి జిల్లాలో సీ- విజిల్ యాప్ లో నమోదైన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా తెలిపారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి బుధవారం అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. సీ-విజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఫిర్యాదు(ఇఎస్ఎంఎస్), ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఫిర్యాదుల పరిష్కారం, జిల్లాలో ఎన్నికల సక్రమ నిర్వహణకు అవసరమైన సన్నద్ధత ఇతర ఎన్నికల అంశాలపై సీఈవో ముఖేష్ కుమార్ మీనా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటన విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కమిషన్ సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణకు ప్రతిష్ట ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, సీ- విజిల్ యాప్ లో నమోదైన ఫిర్యాదులను, అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కృష్ణశేఖర్


నూతన నాయకత్వాన్ని అభినందిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - కోటనందూరు

తుని లాయర్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సలుగు కృష్ణశేఖర్ ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా సలుగు కృష్ణశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా యనమల సత్యనారాయణ, సెక్రటరీగా మేడిది గణేష్, జాయింట్ సెక్రటరీగా చిత్రా రాజేష్, కోశాధికారిగా సాకా సత్తిబాబు, లైబ్రరీ సెక్రటరీగా నారాయణాచార్యులు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా జెవి.రమణమూర్తి, లేడీ రిప్రజెంటేటివ్‌గా పి.కరుణశ్రీ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సీనియర్ న్యాయవాది వసంతల అప్పారావు నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులుగా ఎన్నికైన సలుగు కృష్ణశేఖర్ 2019 -20 సంవత్సరంలోనూ అధ్యక్షునిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులందరికీ ఏ సమస్యలు వచ్చినా అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ పరంగా న్యాయవాదులకు రావలసిన రాయితీలు అన్ని అందేటట్లుగా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు భీమనాధులు రమణ, చాగంటి వెంకటరాజు, రేస్ వెంకట్రావు, సిహెచ్.బాలాజీ, బోణం చినబాబు, కాలిబోయిన సూరిబాబు, సిహెచ్‌వి.రమణ, బర్ల రవికుమార్ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

స్వచ్ఛందంగానే దీక్షలు

తాళ్లరేవు: చొల్లంగి సాల్ట్ భూములు స్థానికులకే ఇవ్వాలని 46 రోజులు పాటు స్వచ్ఛందంగానే దీక్షలు చేశామని గ్రామస్తులు అన్నారు. దీక్షా శిబిరం ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దడాల రాజేశ్వరి, ఇస్సాకుల రాణి, అల్లం వీరలక్ష్మి, మేడపాటి దేవానందం, పులుపకూర శ్రీను మాట్లాడారు. దీక్షలు చేయడంలో ఏ ఒక్క పార్టీ ప్రమేయం లేదని అధికార వైసిపి తప్ప, అన్ని పార్టీలు మాకు మద్దతు పలికాయని, రాద్ధాంతం చేశారనడం సరికాదన్నారు. వైసిపి నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎంఎల్ఎ దీక్ష శిబిరానికి రాకపోవడం బాధ కలిగించిందని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కె.త్రిమూర్తులు, జి.లక్ష్మీనారాయణ, పి.చినబాబు పాల్గొన్నారు.

పురోహితునికి సిపిఎం నాయకులు పరామర్శ

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక దేవాలయంలో వీధిలోని శివాలయ అర్చకుడు వెంకట సత్యసాయిని సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు బుధవారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా పురోహితుడు మాట్లాడుతూ సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉందని, వెళ్ళిపోతున్న చంద్రరావును పిలిచి ప్రసాదం తీసుకోమని కోరగా తనపై చేయి చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ పురోహితుడు సాయి ధైర్యంగా ఉండాలని, తాము అండగా నిలబడతామన్నారు. సంబంధిత అధికారులు బాధితునికి న్యాయం జరిగే విధంగా దోషి పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నీటి ఎద్దడి లేకుండా ముందస్తు కార్యాచరణ

ప్రజాశక్తి - కాకినాడ

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అవసరమైన ముందస్తు కార్యాచరణను సిద్ధం చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. బుధవారం ఆయన సామర్లకోటలోని వేసవి జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీటి నిల్వలపై ఆరా తీశారు. రిజర్వాయర్ సామర్థ్యం ఎంత? ప్రస్తుతం నీటి నిల్వలు ఏ మేరకు ఉన్నాయి? ప్రజలకు సమృద్ధిగా నీరందించడానికి తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా రూ.1.28 కోట్ల వ్యయంతో వేసవి కార్యాచరణను సిద్ధం చేశామన్నారు. అవసరమైతే ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీరందిస్తామన్నారు. ఈ పర్యటనలో ఎస్ఇ పి.సత్యకుమారి, ఇఇ మాధవి, డిఇ శ్రీనివాస్, ఎఇ సాంబశివరావు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో నిత్య అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం దూర ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణీలకు మన పెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో 120 మంది గర్భిణీలకు అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని గైనిక్ స్పెషలిస్ట్ డాక్టర్ జగదాంబ ప్రారంభించారు. అనంతరం మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం ప్రతి బుధవారం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అనూష, కాకినాడ చేయూత స్వచ్ఛంద సంస్థ అధినేత రవి, దేవత రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

నాటక రంగాన్ని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

భూత, భవిష్య, వర్తమానాలకు పునాదిగా నిలిచే ఏకైక కళారూపం నాటకమని దీనిని ప్రజలు ఆదరించడంతోపాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహించాలని నాటక కళాకారుడు కెర్ల పుల్లారావు అన్నారు. బుధవారం ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు నాటక రంగం ఆధునీకతను సంతరించుకుంటూ సామాజిక, రాజకీయ సమస్యలను సార్వజనీకంగా రచిస్తూ సమగ్రంగా చూపించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కళాకారిణి పక్కి మణిబాల మాట్లాడుతూ తాను 32 సంవత్సరాలుగా నాటకాలలో నటిస్తున్నానని అన్నారు. అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చిన్న అప్పాజీ, కాలా ధనరాజు, పైడా రవి, పాల్గొన్నారు.

ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఇంజ నీరింగ్ కళాశాల ఎంసిఎ విభాగంలో ఎపి రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి శిక్షణా సంస్థ ఆధ్వ ర్యంలో 'ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్మెంట్' అనే అంశంపై శిక్షణా కార్యక్రమం ప్రారంభం అయ్యింది. బుధవారం నుంచి 5 రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎపిఎస్ఎస్‌డిసి ప్రతినిది ఎస్.వర ప్రసాద్ ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం లో డీన్ అకాడెమిక్స్ డాక్టర్ ఎస్.రమ శ్రీ, ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ ఎంవి.రాజేష్, వర్కషాప్ కోఆర్డినేటర్ టి.ఉదయలక్ష్మి, ఆదిత్య, ఇతర అధ్యా పకులు, మొదటి ఏడాది విద్యార్థులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న తోట నరసింహం

వైభవంగా విగ్రహాల ప్రతిష్టాపన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి సరస్వతి ఆలయం వద్ద బుధవారం విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్య శర్మ, రఘురాం శర్మ, వేద పండితుల వేదమంత్రాల నడుమ సాగింది. సొసైటీ మాజీ అధ్యక్షులు మేడిబోయిన గోవిందరాజులు కుమారులు మేడిబోయిన వీరవెంకటసత్యనారాయణ, శివరామకృష్ణ, గంగాధర్, రంగా ప్రసాదు దంపతుల చేతుల మీదుగా విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విగ్రహ ప్రతిష్టాపన తమ చేతుల మీదుగా జరగడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి తోట నరసింహం, వైసిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, తుమ్మలపల్లి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

10వ తరగతి పరీక్షలకు 36 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోలో బుధవారం జరిగిన 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం ఐదు సెంటర్లలో పరీక్షలను నిర్వహించగా 1038 మంది విద్యార్థులకు గాను 1002 మంది విద్యార్థులు హాజరయ్యారు. 32 మంది విద్యార్థులు గైరహాజరైనట్లు ఎంఇఒ జోసఫ్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 989 మందికి 981 మంది ప్రయివేట్ విద్యార్థులు 49 మందికి 21 విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ప్రధాన సబ్జెక్ట్ లకు పరీక్షలు పూర్తయ్యాయని, ఇంకా కొంతమందికి సంస్కృతం, ఒకేషనల్ సబ్జెక్ట్‌లకు పరీక్షలు జరగాల్సివుందన్నారు.

ఎన్నికల ప్రచారాలు..చేరికలు...


కరపలో జనసేనలో చేరిన వారితో మాట్లాడుతున్న అభ్యర్థి పంతం నానాజీ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లో ఎన్నికల ప్రచారాలు సాగాయి. వైసిపి, టిడిపి, జనసేన పార్టీల్లో పలువురు చేరారు. అభ్యర్థులు పలువురు ముఖ్య నేతలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తాళ్లరేవు అగ్నికులక్షత్రియ సామాజికవర్గానికి చెందిన పలు కుటుంబాలు టిడిపిలో చేరారు. స్థానిక పంచాయతీ పరిధిలోని రచ్చవారిపేట, మార్కెట్ వీధిలకు చెందిన పలు కుటుంబాలు టిడిపి ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు సమక్షంలో చేరిన వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, ధూళిపూడి వెంకటరమణ, నడింపల్లి వినోద్, వాశంశెట్టి శ్రీనివాసరావు, గంజా సూరిబాబు పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండలంలోని వేలంక గ్రామంలో టిడిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే వైసిపి పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత, వైసిపి కాకినా పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మాజీమంత్రి ముద్రగడ పద్మనాభంను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ మరోసారి జగన్‌ను సిఎంగా చేసుకునేందుకు వైసిపి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని వికె రాయపురం గ్రామంలో టిడిపికి చెందిన పలువురు వైసిపిలో చేరారు. వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కరప** మండల జనసేన ఉపాధ్యాక్షుడు సైనవరపు భవాని శంకర్, కరప గ్రామ జనసేన సీనియర్ నాయకులు యాళ్ళ వివి సత్యనారాయణ అధ్వర్యంలో పలువురు జనసేన కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ సమక్షంలో జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సైనవరపు సతీష్, భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, పేపకాయలు పవన్ కుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **కాకినాడ** టిడిపి మహిళ అధికార ప్రతినిధి మీసాల రమా సునీత వైసిపిలో చేరారు. ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, వైసిపి కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర శివ ప్రసన్న, ముత్యాల సతీష్, తోట సతీష్ పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని రాయభూపాలపట్నం, వాలు తిమ్మాపురం గ్రామాలకు చెందిన పలువురు వైసిపిలో చేరారు. వీరికి వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గవరసాన సూరిబాబు, పెంకే సత్యవతి, మిరియాల రాజా, ఉరదాసు చిన్నరాజులు, బచ్చల రాజు పాల్గొన్నారు. **జగ్గంపేట** టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జగ్గంపేటలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, దేవరపల్లి మూర్తి, కురుమిల్లి శ్రీను పాల్గొన్నారు.


కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన ఎంపి గీత, అభ్యర్థి సునీల్

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా ముదునూరి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ముదునూరి మురళీకృష్ణంరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపిలో కష్టించి పనిచేసే ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరింత కష్టపడి పనిచేసి టిడిపి అభ్యర్థులు విజయానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన శాసన మండల ప్రతిపక్ష యనమల రామకృష్ణుడు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, పరుపుల సత్యప్రభ, ఎస్‌విఎస్ఎన్.వర్మ లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం జాతీయ రహదారిపై మండపాక కన్నాబ్బాయి మెమోరియల్ ఆధ్వర్యం లో చలివేంద్రం ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం నాలుగు నెలలు జాతీయ రహదారిపై బాటసారులకు వాహనదారులకు మజ్జిగ మంచినీళ్లు అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండపాక వెంకటాచలం, మండపాక శ్రీ బాబు, మండపాక అనిల్ కుమార్, మండపాక శివకుమార్, మొగిలి గంగాధర్ పాల్గొన్నారు.


నామినేషన్ పత్రాలను ఇస్తున్న వైధిలింగం

నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లోక్ సభ స్థానానికి ఏప్రిల్ 19న జరగనున్న ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వి.వైధిలింగం బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎంపీగా ఉన్న వైధిలింగంను కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో. ఆయన నామినేషన్ దాఖలు చేశారు. పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి, ఇతర నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

ప్రజాశక్తి - పెద్దాపురం


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని డిఎస్‌పి లతాకుమారి కోరారు. బుధవారం పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలో ఎస్ఐ వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలు, పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎన్నికల నిర్వహణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలు నియమ నిబంధనలు, పోలీసుల విధులపై ప్రజలకు వివరించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ రవికుమార్ పాల్గొన్నారు.